# ప్రేమాభిమానాలు

ఆ రోజు రాఖీపౌర్ణమి. అన్నాచెల్లెళ్లమధ్య ఆత్మీయబంధాలు మరింత బిగుసుకునే రోజు. ఎన్నో ఎదురుచూపులు... మరెన్నో జ్ఞాపకాల దొంతరలు హృదయనాదాలపై నాట్యమాడే రోజు.

అప్పుడు సమయం ఉదయం 10.30 అయింది. వెంకట్ ఆఫీసుకి బయలుదేరేందుకు ఇంట్లో నుంచి బయటకు అడుగుపెట్టాడు. అప్పుడే జేబులోని సెల్‌ఫోన్ మ్రోగింది. "హృదయమెక్కడున్నాది... హృదయమెక్కడున్నాది... నీ చుట్టూనే తిరుగుతున్నాది... అందమైన అబద్ధం..." అంటూ గజని సినిమాలోని రింగ్‌టోన్ శ్రావ్యంగా, చెవులకి వినసొంపుగా మ్రోగింది.

"హలో!..." సెల్ ఆన్ చేసాడు వెంకట్.

"హలో అన్నయ్యా! నేను రమ్యని... ఆఫీస్‌కి వెళ్లిపోయావా?" అడిగింది అవతల నుంచి రమ్య. రమ్య వెంకట్‌కి ఒక్కగానొక్క చెల్లెలు. ఆ ఊర్లోనే ఆమె అత్తగారిల్లుకూడా.

"లేదు రమ్యా! ఇంతసేపూ నువ్వొస్తావేమోనని ఎదురు చూసీ చూసీ... ఇప్పుడే ఆఫీస్‌కి బయలుదేరాను" చెప్పాడు వెంకట్.

"నా కోసం ఒక అరగంట వెయిట్ చెయ్యి అన్నయ్యా... ఇప్పుడే మీ ఇంటికి బయలుదేరుతున్నాను" రిక్వెస్ట్‌గా అడిగింది రమ్య.

"అరగంట పడుతుందా?..." అంటూ వెంకట్ తటపటాయిస్తూ "సర్లే... త్వరగా వచ్చెయ్ చెల్లాయ్... మరీ ఆలస్యమైతే మా బాస్ ఊరుకోడు" చెప్పాడు వెంకట్.

"అలాగే అన్నయ్యా! ఇదిగో ఇప్పుడే బయల్దేర్తున్నాను" అంటూ ఫోన్ కట్ చేసింది రమ్య.

గడియారంలో ముళ్ళు ఎవరికోసమూ ఎదురుచూడకుండా స్పీడ్‌గా పరిగెత్తేస్తున్నాయి. వెంకట్‌లో టెన్షన్ పెరిగి అసహనంతో అటూఇటూ తచ్చాడుతున్నాడు. అరగంట అంది. అరగంట దాటి గంట కావస్తున్నా రమ్య అయిపూ అజా లేదు. పోనీ ఆఫీసుకి వెళ్లిపోదామా అనుకుంటే రమ్య అంతదూరం నుంచి వచ్చి ఉసూరుమంటూ బాధపడుతూ తిరిగి వెళ్లడం అతనికి మనస్కరించలేదు. అసలే సంవత్సరానికి ఒక్క రోజు వచ్చే పండుగిది. తమ మధ్య ప్రేమాభిమానాలు మరింత బలంగా ప్రోదిచేసుకోవాలంటే ఆ మాత్రం ఎదురుచూడకపోతే ఎలా? బాస్ అరిస్తే అరిచాడులే ఈ ఒక్కసారికి" అని మనస్సులోనే సముదాయించుకున్నాడు వెంకట్. ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దమైంది. ఆత్రంగా బయటకి పరుగుతీసేసరికి అతనికంటే ముందు అతని శ్రీమతి విజయ ఎదురెళ్లి రమ్యని పలకరించింది. "ఏమ్మా రమ్యా... ఎలావున్నావ్? మీ అత్తగారూ వాళ్లందరూ బాగున్నారా? అన్నయ్యగారూ పిల్లలూ రాలేదేం?" అడిగింది ఆడపడుచు చేతిలోవున్న లగేజిని అందుకుంటూ.

"ఆ బాగున్నా వదినా! ఆయనకి అర్జంట్ పనుందని ఆఫీసుకి వెళ్ళి పోయారు. పిల్లలకేమో మంత్లీ టెస్ట్‌లున్నాయి. అందుకే వాళ్లని స్కూల్‌కి పంపించి వచ్చేసరికి ఈ సమయమైంది" చెప్పిం

**చలపాక ప్రకాష్**


AVM

ది రమ్య.

"అలాగా... సర్లేగానీ... కాస్త త్వరగా కానీయ్ రమ్యా... అసలే అన్నయ్యకి ఆఫీస్‌కి లేట్ అయ్యింది" తొందరచేసింది విజయ.

"అలాగే వదినా" అంటూ గబగబా లోపలికెళ్లి తాను తెచ్చిన కవర్లోని వస్తువులన్నీ టేబుల్ మీద సర్దింది. అన్నగారికి ఒక కుర్చీ వేసింది. అందులో అతన్ని కూర్చోబెట్టి మొఖానికి కుంకుమ బొట్టు పెట్టింది. తాను తెచ్చిన రంగు రంగుల చెమ్కీలు అద్దిన అందమైన రాఖీని అతని కుడిచేతి మణికట్టుకి కట్టింది. హారతి పళ్లెంలో కర్పూరం వెలిగించి అన్నగారికి హారతిచ్చింది.

"అన్నయ్య సన్నిధి... అదే నాకు పెన్నిధి... కనిపించని దైవమే..." అంటూ ఏదో పాత సినిమాలోని పాటని కూడా అందుకుంది. అక్షింతలిచ్చి ఆశీర్వదించమంది. ఆ అనురాగానికి, ఆత్మీయతకీ ఆ అన్న ఒళ్లు ఓ క్షణం తన్మయత్వంతో పులకరించింది. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో, ప్రేమా వాత్సల్యం చూపే బంగారం లాంటి చెల్లెలు లభించింది. ఈ ఆత్మీయతానుబంధాలు జన్మజన్మలకూ ఇలాగే సాగితే ఎంత బావుండు... కరిగిపోయింది అతని హృదయం.

"ఏమిటన్నయ్యా! అక్షింతలువేసి ఆశీర్వదించమంటే అలా మిన్నకుండిపోయావు?" అన్న రమ్య మాటకి ఉలిక్కిపడి ఈ లోకంలో కొచ్చాడు వెంకట్. అక్షింతలు వేసి చెల్లెల్ని ఆశీర్వదించాడు. "శ్రావణ శుక్రవారం వస్తోంది. బంగారు రూపు చేయించుకోవాలి... కుదురుతుందో



గుంటూరులో 'మనిషికోసం' నానీల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య తేళ్ల సత్యవతి. చిత్రంలో ముఖ్యఅతిథి శ్రీమతి గద్దె రామతులసమ్మ, సభాధ్యక్షులు ప్రముఖ కవి సోమేపల్లి వెంకటసుబ్బయ్య, పుస్తక రచయిత నాగిశెట్టి తాతయ్యనాయుడు, కవులు ఎస్.ఆర్. భల్లం, డా॥ పి.వి. సుబ్బారావు, కోసూరి రవికుమార్, దాసరి చంద్రశేఖర్ ఉన్నారు.

కథా నిలయం శ్రీకాకుళం

లేదో" గత కొన్ని రోజుల క్రితం తన చెల్లెలు ఎవరితోనో అంటూండగా విన్న మాటలను గుర్తుంచుకొని, రాఖీపౌర్ణమి కానుకగా చెల్లెలికి తన శక్తి కొలదీ ఓ బంగారు రూపు చేయించి బహూకరించాడు. ఊహించని ఆ కానుకను చూసి రమ్య కళ్లు ఆనందంతో మెరిసాయి. తను కోరుకున్న వస్తువుని అడగకుండానే తన మన సెరిగి సర్‌ప్రయిజ్ గిఫ్ట్‌గా ఇచ్చేసరికి అన్నమీద ఉన్న అభిమానం రెట్టింపైంది. ఆడపిల్లలో ఆ ఆనందం కోసమే కదా పుట్టింటివారు వెదక వల్సింది?

"సరే చెల్లీ! ఇక నేను ఆఫీస్‌కి బయలుదేరు తాను. నువ్వు రాత్రికి ఇక్కడే వుండు. బావకి ఫోన్ చేసి ఆయన్నూ ఇక్కడికి రమ్మని చెబు తాను" అని చెప్పి కంగారుగా ఆఫీస్‌కి బయలు దేరాడు వెంకట్.

"అసలే కంగారుపడుతున్నారు... జాగ్రత్తగా వెళ్లండి" తన భర్త హడావిడిని చూసి భయంగా అంది విజయ.

* * *

సమయం రాత్రి 9.30 అయింది. జోరున వర్షం కురుస్తోంది. ఆ వర్షంలో బస్ వచ్చి ఆగిం ది. అందులో నుంచి దిగిన వెంకట్ వర్షంలో తడవకుండా వుండేందుకు తన అరచేతుల్ని నెత్తిమీద అడ్డంగా పెట్టుకొని బస్ షెల్టర్‌లోకి పరిగెత్తాడు. వర్షం బాగా వస్తోంది. ఇప్పుడప్పుడే తగ్గే సూచనలేం కనిపించట్లేదు. తాను ఇంటికి చేరాలంటే కనీసం పదినిమిషాలు నడిస్తేగానీ ఇంటికి చేరుకోలేడు. అంతదూరం నడిచి వెళ్లేసరికి వర్షంలో తడిసి ముద్దవడం ఖాయం. అసలే జ్వరం వచ్చినట్లుగా ఒళ్ళు వేడిగా కాలు తోంది. ఇప్పుడుగానీ తడిస్తే ఖచ్చితంగా జ్వరం వచ్చి తీరుతుంది. ఇప్పుడెలా? వర్షం తగ్గుతుందే మోనని కాసేపు వేచిచూసాడు. కాని... అరగం ట గడిచినా వర్షం తగ్గలేదు సరికదా, ఇంకా పెరిగింది. ఇంటికి చేరటం ఎలా? ఆలోచిస్తున్నా డు. అంతలో చటుక్కున ఒక ఆలోచన తట్టిందత నికి. రమ్యని తాను ఈ రోజు రాత్రికి తనింట్లోనే వుండమన్నాడుకదా. రమ్య దగ్గర సెల్‌ఫోన్ వుంది. ఆమెకి ఫోన్ చేసి గొడుగు తెమ్మంటే సరి. ఆలోచన వచ్చిందే తడవుగా రమ్యకి ఫోన్ చేసాడు వెంకట్.

"హలో రమ్యా... వర్షం బాగా వస్తోంది. అరగంట నుంచి తగ్గుతుందేమోనని ఎదురుచూ సినా తగ్గట్లేదు. నేనిక్కడ బస్టాప్‌లో ఇరుక్కు పోయాను. కాస్త గొడుగు తెస్తావామ్మా... కావ లిస్తే నీకు తోడు మీ వదిన్ని కూడా తీసుకురా. ఇంట్లో రెండు గొడుగులున్నాయ్" చెప్పాడు వెంకట్.

"ఆ... తెస్తానుండన్నయ్యా" అంది రమ్య నిద్రమత్తుగా.

క్షణాలు దొర్లుతున్నాయి. పావుగంట... అర గంట... అలా సమయం పరిగెడుతూనే వుంది. కానీ రమ్య వస్తున్న జాడేలేదు. 'ఇంటి దగ్గర కరెంట్ వుందో లేదో... లేకపోతే ఎప్పుడో వచ్చి వుండేది రమ్య' అని సరిపెట్టుకుంటూ... వర్షం కాస్త తగ్గింది... ఎలాగోలా వెళ్లిపోతే సరి అని సన్నని జల్లులోనే తడుసుకుంటూ త్వరత్వరగా నడవడం ప్రారంభించాడు. వర్షం జోరు తగ్గినా ఇంటికి చేరేసరికి పదినిమిషాలు పైనే పట్టేసరికి బాగా తడిసిపోయాడు. కాని అతనూహించినట్లు ఇంటి దగ్గర కరెంటేమీ పోలేదు. తాను తడిసి వస్తాడని ఇంట్లోవాళ్లు కంగారుగా ఎదురుచూ స్తుంటారనుకుంటే ఆ ఆధారాలేం కనిపించట్లే దక్కడ. అంతా నిశ్శబ్దం తాండవిస్తోందక్కడ. తడిసిన జుత్తును సరిచేసుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాడతను. రెండు నిమిషాలకి తలుపులు

తెరుచుకున్నాయి.

"అయ్యో! తడిసిపోయారా?" అంటూ ఎదురొచ్చింది అతని శ్రీమతి విజయ.

"అరగంట నుంచి వెయిట్ చేస్తున్నా. గొడుగు తీసుకురమ్మంటే తీసుకురాలేదేం?" వస్తున్న కోపాన్ని అదిమి పెట్టుకుంటూ అడిగాడు వెంకట్.

"గొడుగా?... ఎవరికి చెప్పారు?" అడిగింది ఆశ్చర్యంగా విజయ.

"రమ్యకి ఫోన్ చేసి చెప్పాగా... గొడుగు తీసుకొని మీ ఇద్దర్నీ బస్టాప్‌కి రమ్మనమని".

"రమ్యకా? నాకేం చెప్పలేదే?" అంటూ హాయిగా ముసుగుతన్ని నిద్రపోతున్న రమ్యని లేపింది విజయ.

"ఏంటి వదినా... ఆయన వచ్చారా?" బద్ధకంగా ఆవులిస్తూ అడిగింది రమ్య.

"లేదమ్మా! మీ అన్నయ్య వచ్చారు. అవునూ... నిన్ను గొడుగు తెమ్మని బస్టాప్ నుంచి ఫోన్ చేసారటగా. కనీసం నాకు చెప్పలేదేం?" నిలదీస్తున్నట్లుగా అడిగింది విజయ.

"వర్షంతోపాటు గాలికూడా బాగా వీస్తోంది కదా, గొడుగుతో పాటు సన్నగా వున్న నేను కూడా ఎగిరిపోతానేమోనని భయమేసింది వదినా" అంది హాస్య ధోరణిలో అతి మామూలుగా.

అంతే...! ఆ మాటలు విన్న వెంకట్ ఒక్క క్షణం బిత్తరపోయాడు. తన అన్న ఎక్కడ తడిసిపోతాడోనన్న అభిమానంతో గొడుగుతో ఎదురొస్తుందని ఆశించిన అతనికి ఆ మాటలు హేళన చేసినట్లనిపించాయి. అభిమానాలు, ఆత్మీయతలు, ప్రేమలు, అనురాగాలు... ఇవన్నీ సినిమాలకి, సినిమా డైలాగ్‌లకీ పరిమితమని, నిజజీవితంలో అవి ఉత్త ట్రాష్ అని ఈ సంఘటనతో కొట్టిపారేసినట్లైంది. ఎన్నో సినిమాలు చూసాడు తను. ఎన్నో టి.వి. సీరియళ్లలోనూ అప్పుడప్పుడూ గమనించాడు... అన్నాచెల్లెళ్ళ అనురాగబంధాలు, ఒకటిగా పెనవేసుకున్న ప్రేమాప్యాయతలు చూసి పులకరించిపోయేవాడు. చెల్లెలి ఆనందం కోసం అన్న పడే ఆరాటం, అన్న కోసం చెల్లెలు పడే భావావేశం, మూగరోధనలు చివరికి ఒకరి కోసం మరొకరు ప్రాణత్యాగాల కోసం సైతం పోటీగా పరితపించే అన్నాచెల్లెళ్ల బంధాన్ని అతను ఎంతో గొప్పగా ఊహించుకొనేవాడు. అదే కోరుకున్నాడతను. కానీ, సినిమాలు, జీవితం వేర్వేరని... కేవలం వాటిని ఊహల్లో విహరించే సాధనాలుగా మాత్రమే పరిగణించుకోవాలని ఇప్పుడే తెలుసుకున్నాడతను.

'రక్షాబంధం అనేది ఆ బంధాన్ని గుర్తుచేసేదే గానీ... ఒకరి రక్షణకు మరొకరు తోడ్పాటు అందివ్వనపుడు అది ఓ వేడుకగా నిలిచిపోతుందే గానీ దాని అర్థం... పరమార్థం... ఇంకేం మిగిలుంటుంది?

కష్టసుఖాలలో, కనీసం తాము చేయగలిగే సాయంకూడా ఒకరికొకరు చేసుకోలేకపోతే... ఇక బంధాలు, బంధుత్వాలు ఎందుకు?... ఎవరిని ఉద్ధరించటానికి?...

ఇంతలో ఎక్కడినుంచో లీలగా అతని చెవులకి తాకింది 'తాతా-మనవడు' సినిమాలోని పాట... "అనుబంధం... ఆత్మీయత.. అంతా ఒక బూటకం... ఆత్మశుద్ధికై మనషులు ఆడుకునే నాటకం... వింత నాటకం"... అవును... ప్రేమ... ఆప్యాయత... అంతా బూటకం. మనుషులు ఏర్పరుచుకునే ఓ స్వార్థపు ట్రాష్..." బరువెక్కిన హృదయంతో ఓ నిట్టూర్పు విడిచాడు వెంకట్. ●